# ఆలి

ఓ.ఆర్.ఇంద్ర



## జన్మదిన కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి రు.1,000/- గెలుచుకున్న కథ

"కృష్ణా, నీకు ఫోను!"

రాస్తున్న ఫైలు మూసివేశాను. "ఇలా ఆఫీస్‌కి ఫోన్‌చేసి నా పరువు తీయకు తల్లీ!"అని తులసిని గట్టిగా హెచ్చరించాలని చాలాసార్లు అనుకోవడం - తీరా ఫోనెత్తాక పైఆఫీసర్‌తో 'చిత్తం, చిత్తం'అన్నట్టే 'అలాగే' అనడం నాకలవాటైపోయింది. ఈరోజు ఎట్టిపరిస్థితుల్లోనూ కలవడం కుదరదని గట్టిగా చెప్పాలనుకుని ఫోనెత్తాను.

"కృష్ణా, సాయంత్రం ఆరుగంటలకు పుష్కరాలరేవు దగ్గరకు వస్తున్నావు... వస్తున్నావు... వస్తున్నావు... అంతే" అంటూ నేను మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే ఫోన్ పెట్టేసింది. 'నో' అనే అవకాశం నాకెప్పుడిచ్చింది గనక! తులసిని తల్చుకుంటే నా గుండెల్లో రైళ్లు

పరిగెడతాయి. ఆనందంతోనో, ఆవేశంతోనోకాదు. భయంతో. తులసిది భయంకల్గించే ఆకృతనుకుంటే పొరబాటే. తులసి చాలా సలక్షణమైన ఆడపిల్ల. తులసంటే నా భయానికి కారణం. తులసికిగలచొరవ, నిర్భీతి, గలగల నవ్వుతూ మాట్లాడేనేరు. ఎత్తైన కొండలమీదలనుండి హోరెత్తుతూ చాలావేగంగా దుమికే జలపాతం తులసి. నాస్వభావం అందుకు పూర్తిగా విరుద్ధం. నిశ్శబ్దంగా, మెల్లిగా ప్రవహించే పిల్లకాలవని నేను. గట్టిగా, స్పష్టంగా, సూటిగా మాట్లాడటం నాకు చేతగాదు. ఎదుటివాళ్ల డిమాండ్లకి నో అనాలనుకుంటూనే నాకు తెలియకుండానే 'యస్' అనేసే మొహమాటస్థుణ్ణి. అందుకే ముప్ఫై నాల్గేళ్లొచ్చినా ఇంకా పెళ్లికాని బ్రహ్మచారిని. 'ముదిరిపోయిన బెండకాయ' అన్న ముద్ర వేయించుకున్నవాణ్ణి. పెళ్లికావలసిన ఆ ఆడపిల్ల. ఇలా నాకు రోజూ ఫోన్లు చేస్తూంటే నా గురించి చూసేవాళ్లేమనుకుంటారో అనే భయంతో ఫోనెత్తడానికే జంకుతాను.

ధైర్యం కూడదీసుకుని నాలో నేనే చాలాసార్లు రిహార్సల్ వేసుకుని "పెళ్లయి ఒకరింటికి వెళ్లాల్సినదానివి. ఎంత స్నేహితుడైతే మాత్రం ఇలా పరాయి మగవాడితో ఫోన్లు, సినిమాలూ, షికార్లూ ఏమిటి? ఎవడైనా పెళ్లాడతాడా నిన్ను?" అని మెల్లిగా చీవాట్లు వేస్తే పకపకా నవ్వుతుంది. "ఏతలమాసినవాడూ కట్టుకోవడానికి ముందుకు రాకపోతే- నువ్వున్నావుగా" అనేస్తుంది చాలా సులువుగా. ఆ నిర్భీతి, సూటిదనం అంటేనేనాకు భయం.

అంత చనువుగా ఉండటానికి తులసి నా మేనత్త కూతురూ కాదు, నాక్లాస్మేటూకాదు.

చిన్నప్పటినుండీ ఇద్దరిదీ ఒకేఊరు-ఎదురుబొదురిళ్లు. తులసి నాకన్నా రెండేళ్లు పెద్ద. పున్నామ నరకంనుంచి తప్పించే పుత్రుడికోసం ఎదురుచూస్తూ, తులసి తల్లిదండ్రులు అరడజను మంది ఆడపిల్లల్ని కంటే'దేవుడిచ్చే పిల్లల్ని మనిషి పరికరాల్తో ఆపడం మహా పాపంరా' అంటూ మా పితాశ్రీ అర్గురు మగవెధవలకి జన్మనిచ్చాడు. గుండెలమీద కుంపట్లలా అరుగురాడపిల్లలున్నారన్న చింతకన్నా, ఇంకా వంశోద్ధారకుడు లేడే అన్న బాధే తులసి తల్లిని బాధించేది. 'ఇంతమంది పోతువెధవలెందుకూ? మాహాలక్ష్మిలాటి ఒక్క ఆడపిల్లయినా లేకపోయిందే అచ్చటా, ముచ్చటా తీర్చుకోవడానికి'అని అమ్మగొణుక్కొంటుంటే- 'గాడ్స్ మస్ట్ బి క్రేజీ' అనిపించేది నాకు.

పిల్లల్ని కనడంలో మాత్రమే మగతనం ఉందనుకున్న నాన్న, కన్నపిల్లలకి విద్యాబుద్ధులు చెప్పించడం మాత్రం తన బాధ్యత కాదనుకోవడంవల్ల, స్కూల్ఫైనల్తోనే నా చదువుకి స్వస్తి చెప్పాల్సి వచ్చిందివద్దనిమిదేళ్లకి నా అంతట నేను ఓ చిన్న




గుమాస్తాగిరి సంపాదించుకోవల్సి రావడమేగాక, నా తమ్ముళ్ల చదువులు, బరువు బాధ్యతలు నా మీద పడ్డాయి. ఇంటికి పెద్ద కొడుకుగా పుట్టానుగదా గాడిదబరువు మోయక తప్పుతుందా? భూమిని మోసిన హెర్క్యులెస్లా పదహారేళ్లుగా కుటుంబ బాధ్యతల్ని మోస్తూనే వచ్చాను. చిన్న తమ్ముడి చదువు కూడా పూర్తయింది. నాకు సగం బట్టతలా అయింది. చెంపలూ నెరిశాయి.

పదేళ్ల క్రితం అమ్మ-"తమ్ముళ్ల బరువు బాధ్యతలు తీరేదాకా మా పెద్దాడు ససేమిరా పెళ్లిచేసుకోనని మొండికెత్తాడమ్మా" అని నాకోసం వచ్చిన పెళ్లి వారితో అనడం నాకాశ్చర్యం కలిగించలేదు. అమ్మ మొదట ఓ మనిషి. తర్వాతే స్త్రీ. ఓ తల్లీను. అందుకే మనిషిగా స్వార్థం ఆవిడలోని స్త్రీనీ, తల్లినీ, ఓడించింది. నాకు నోట్లో నాలుకలేదు కాబట్టి, నాకు పెళ్లిచేస్తే కొంగుచాటు మొగుడ్నవుతానేమో. వచ్చే కోడలు

కుటుంబాన్ని ఆదుకోనివ్వదేమోనని అమ్మ భయపడటం నిర్హేతుకం కాదేమో! నోట్లో నాలుకలేని మనిషికి కూడా ఓ మనసూ, దేహధర్మాలూ, వాంఛలూ ఉంటాయని అరడజనుమందిని కన్న అమ్మకీ, నాన్నకీ తెలియకపోవడం ఆశ్చర్యమే. బలిపశువులు లేకుండా యజ్ఞాలు పూర్తి అవవుగదా!

తులసికి ఒకందుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. చదువులో నేనెపుడూ బడుద్ధాయినే. ప్రత్యేకించి లెక్కలలో నేనెపుడూ వెనకే. స్కూల్ ఫైనల్ చదివేటపుడు తులసి నన్ను తన పెద్ద చెల్లితోబాటు కూర్చోబెట్టి 'మొద్దు బుర్ర' అంటూ నా మాడుపగిలేలా మొట్టికాయలు మొట్టి లెక్కలు చెప్పి స్కూల్ఫైనల్ గట్టెక్కేలా చేసింది. తులసి తండ్రి తినికూర్చుని, ఏమీ పట్టించుకునేవాడుకాకపోవడంతో, ఆడపిల్లయి ఉండీ కుటుంబాన్ని ఆదుకోవలసి రావడంతో తులసికి చొరవ, నిస్సిగ్గులాటి మగలక్షణాలు వచ్చేయేమో అనిపించేవి. స్కూల్ఫైనల్ తర్వాత, తులసి టెలిఫోన్ ఆపరేటర్గా చేరింది.

"చెల్లెళ్లు ఒకదారికొచ్చేదాకా తన పెళ్లిమాటే ఎత్తవద్దంటోందమ్మా, ఎంత చెప్పినా వినడమే లేదు." అని పనికట్టుకు ప్రచారం చేసి, అసలు సంబంధాలే చూడని తులసి తల్లిదండ్రుల్ని తులసి తప్పుపట్టలేదు. పట్టుదలతో ప్రయివేటుగా పరీక్షలకు చదివి డిగ్రీ పూర్తిచేసి, బాంక్లో కాషియర్గా చేరిందని విన్నాను. సంవత్సరం క్రితం తులసికి రాజమండ్రికి బదిలీ అయి హఠాత్తుగా కనపడేవరకూ పదేళ్ళపాటు తులసిని నేను చూడనేలేదు. సన్నగా, రివటలా ఉండేతులసి, ప్రౌఢవయసురావడం వల్లనేమో పుష్టిగా, చెయ్యితిరిగిన శిల్పి చెక్కిన విగ్రహంలా ఉంది. తులసే నన్ను బజారులో పేరుపెట్టి పిలిచి ఉండకపోతే తులసిని నేను గుర్తుపట్టి ఉండేవాడ్నికాను.

తులసి నన్ను హోటల్కి లాక్కువెళ్లి కూర్చోబెట్టి తన కుటుంబ విషయాలు చాలాచెప్పింది నాన్ ఎక్స్ప్రెస్లా. తిని కూర్చునే తండ్రి పక్షవాతం వచ్చి, మంచాన పడ్డాడనీ, చెల్లెళ్లందరికీ పెళ్లిళ్లు చేసి బరువు బాధ్యతల తీర్చుకున్నాననీ చెప్పింది. అక్క పెళ్లిమాటే ఎత్తకుండా అక్క సంపాదనతో కట్నాలిచ్చి మొగుళ్లని కొనుక్కున్న చెల్లెళ్ళు, ఇపుడు తనని ఎలాతప్పించుకుని తిరుగుతారో జోక్గా చెప్పింది. రెండు సంవత్సరాల క్రితం భార్య చనిపోయిన సీనియర్ బాంక్ మేనేజర్ తనని రెండోపెళ్లి చేసుకోవడానికి ముందుకొచ్చిన ప్రసక్తి చెల్లెళ్ల దగ్గర తెచ్చినపుడు వాళ్లు చాటుగా-'ముసల్లిడికే వయసులో దీనికి మొగుడు కావలసి వచ్చాడట!' అని ఎలా వెటకారాలాడిందీ చాలా కాజువల్గా నవ్వుతూ చెప్పింది.

తులసి వచ్చాక నా జీవితంలో పెనుమార్పులేవీ రాలేదుకానీ, నాకిబ్బందికరమైన మార్పులు వచ్చాయి. నిస్సారంగా, స్తబ్దంగా ఉన్న నా జీవితాన్ని తులసి చైతన్యభరితం చేయడం, భరించలేకపోయాను. అమ్మతోసహా ఏస్త్రీ తోనూ ఏనాడూ ఏ మానసి కానుబంధమూలేని నాకు, తులసి నన్ను కుట్టడానికి సమీపించే తేలులా కనిపించింది. 'నాకెలాగూ




పెళ్లియోగం లేదు. నువ్వయినా పెళ్లి భోజనం ఎపుడు పెట్టిస్తావు కృష్ణా?' అంటూ ప్రాణం తీసేది. తులసి త్వరగా తన ఆఫీసు పని ముగించుకుని నాకోసం ఆఫీసుకు వచ్చినపుడు నాకొలీగ్స్ నావంక చూసేచూపు భరించలేకపోయేవాడ్ని.

ఎవరి బ్రతుకుని వాళ్లని సలక్షణంగా బతకనీయకపోవడం నాగరికత విశిష్ట లక్షణమేమో" నోట్లో నాలుక లేనట్లుండే కృష్ణ అయినా భలే పిటపిటలాడే పిట్టను పట్టాడు గురూ" అనడం- అవతలివాడు'నీ ముఖం... ఈ గెడకర్రని ఆ హీరోయినే ముగ్గులోకి లాగుంటుంది..." అనే కామెంట్స్ నాకు స్పష్టంగానే వినిపించేవి. వాళ్ళ కామెంట్స్ భరించలేక తులసితో_ నాకోసం ఫోన్ చెయ్యకు, నా ఆఫీసుకి రావద్దని చెప్పాలని నోటిదాకా వచ్చి తులసిని చూడగానే నోరు పెగిలేదికాదు. హిప్నటైజ్ అయినట్టుగా తులసిని అనుసరించేవాడ్ని. ఆఫీసునుంచి తిన్నగా పార్కుకో, బజారుకో, సిన్మాకో, ఎక్కడికి వెళ్లాలో తులసే డిక్టేట్ చేస్తుంది. ఇలా ఇద్దరినీ తెలిసున్నవాళ్లెవరైనా చూస్తే బాగోదని గొణిగే నన్ను చూసి తులసి మరింత వేళాకోళం చేసేది. తులసినుండి ఎలా తప్పించుకోవాలో తెలియక సతమతమవుతున్నాను.

ఇపుడు మళ్లీ ఈ ఫోన్! ఏమైనాసరే వెళ్లకూడదనుకున్నాను. కానీ అలా మానేస్తే రేపు తిన్నగా నా ఆఫీసుకేవచ్చేస్తుందని భయంవేసి బయల్దేరాను.

ఈరోజు తులసి ఎందుకో కొత్తగా కన్పించింది. ఆ కొత్తకి కారణం తన పుట్టినరోజని తెలిశాక, 'హేపి బర్త్‌డే' చెప్పక తప్పలేదు. గోదావరి గట్టంతా చల్లగాలిలో నడుచుకుంటూ తిరిగాం. నీరెండలో గోదావరిపై తళుక్కుమని చెదురుతున్న ఎరుపు బంగారు రంగు కెరటాల్ని చూస్తుంటే ఈతరాని సూరీడు గోదాట్లో పడిచేతులు బారచాచి కల్లోలం చేస్తూన్నట్లుంది. కోటగుమ్మం సెంటరు నుంచి డీలక్స్ సెంటర్ దాకా బజారంతా నడిపిస్తూ- "పుట్టినరోజు పాపాయినిగదా, నాకేమిటి బహూకరిస్తావ్?" అనడిగింది తులసి. నేను విస్తుపోయాను. నేను పుట్టిన తర్వాత పుట్టినరోజు పండగ ఎప్పుడూ ఎరగను. ఎవరిపుట్టినరోజు పండుగలకి నేవెళ్లలేదు. అటువంటి ఫార్మాలిటీస్ గురించి ఎరగనివాడ్ని. ఏంకొనాలో తెలియక, కాసిన మల్లెపూలు కొంటూంటే "భలే పిసినారివే, పోనీలే, ఆడపిల్లకి పువ్వులేనా కొనాలని తెలిసింది బడుద్ధాయికి" అంటూ తనే డబ్బులిచ్చింది. తన పుట్టినరోజు విందు అంటూ, నేవద్దంటున్నా వినకుండా కళింగ హోటల్‌కి నడిపించింది.

డిన్నర్ తర్వాత తన ఒకర్తె కిళ్లీ వేసుకుంటూ, "సారీ కృష్ణా! తాంబూలం బ్రహ్మచారులకి ఉద్రేకాన్ని పెంచుతుందట, అందుకే నీకివ్వలేదు" అంటూ నవ్వింది. తులసి మోతాదు మించుతోందనిపించింది. తర్వాత "సెకండ్‌షో సిన్మాకి పద" అంది. నాకు ఒళ్లు మండి రానుగాకరాను పొమ్మన్నాను. రాకపోతే రోడ్డుమీద నిలబడి గట్టిగా అరుస్తానని బెదిరించి లొంగదీసింది.

సినిమా అయ్యాకా అర్ధరాత్రి ఒంటరిగా తన గదికి వెళ్లలేనంటూ నాగదికి వచ్చేసింది' దౌర్జన్యంగా వస్తూన్న అతిథిని 'కాదు' అనలేకపోయాను. ఉద్యోగం వచ్చిన కొత్తలో ఎపుడో కొన్న ముసలి మడత మంచాన్ని తులసికి కేటాయించి, క్రిందచాప వేసుకుని పడుకున్నాను.

కంటికి కునుకు పడితేగా! ఏవిటి తులసి ప్రవర్తనకి అర్థం? పెళ్లికాని ఓ ప్రౌఢ ఓ బ్రహ్మచారి గదిలో రాత్రివేళ గడిపితే - దీన్ని స్నేహమంటే లోకం ఒప్పుతుందా? తాటిచెట్టుక్రింద నిలబడి పాలుత్రాగడం నేరంగా భావించే లోకం నాకు తాటాకులు కట్టడానికి ఇంతకన్నా ఏంకావాలి? ప్రొద్దుటే ఇంటివాళ్ళు, ప్రక్కవాళ్లు తులసిని చూస్తే నాగతేమిటి? నాబాధ తులసికి తెలిసేలా ఎలా చెప్పాలి? నామీద తులసికి హక్కు, అధికారం ఏమిటి ?తిరగబడాలి అంటూ తులసివంక చూశాను. చిన్నపిల్లలా ప్రవర్తించి, ఏమెరగనట్టు ఎంతగాఢంగా నిద్రపోతోంది! నీలంరంగు బెడ్‌లైట్ వెల్తురులో తెల్లని చీరలో, గదిని మత్తెక్కిస్తున్న తలలోని మల్లెలతో, తాంబూల సేవనంతో ఎర్రబడిన పెదవులతో-ఎవరో ప్రబంధ సుందరిలా కన్పిస్తోంది! నగ్నంగా ఉన్న తెల్లని పొట్ట పాముకుసంలా మెరుస్తోంది.

నేచూస్తున్న తులసి కొత్త వ్యక్తిలా కనిపిస్తోంది- తులసి అందచందాలూ, వంపుసొంపులూ ఇపుడు చూస్తూన్నట్లుగా ఎపుడూ చూడకేమో. పదేళ్ల క్రితం అమ్మ నా పెళ్లి సంబంధాన్ని తిరగొట్టినపుడే పెళ్లి స్త్రీ, సెక్స్ గురించిన ఆలోచనలు నా బుర్రలోంచి దాదాపు తుడిచిపెట్టుకు పోయాయి. ఇంటికోసం పొదుపుగా జీవిస్తూ ఎడారిలో ఒంటరి కాక్టస్‌లా ఏకాకి జీవితం గడుపుతూ, అర్ధరాత్రివరకూ పుస్తకాలుచదవడం తప్పించి మరే వ్యాపకమూలేని నారసవిహీన జీవితంలో ఎందుకు ఇలా ప్రవేశించి నా స్తబ్దతనీ,జడత్వాన్నీ కుదుపుతోంది? నవ్వు ఎరగని నా జీవితంలోకి గలగల నవ్వే తులసిరాక నాకానందం కల్గించడంలేదా? ఎటూ తేల్చుకోలేక పోతున్నాను.

నిద్రరాక లేచి కూర్చున్నాను. వద్దనుకున్నా నాకళ్లు తులసివైపు తిరిగాయి. నిద్రలో కలవచ్చిందేమో- చిన్నగా నవ్వుతోంది. ఆ కాశంలో పిల్లమబ్బుల గుంపొకటి చంద్రుడితో దోబూచులాడుతోంది. మబ్బులు తప్పుకున్నపుడల్లా వెన్నెల కిటికీలోంచి గదిలోకి చొరబడి తులసి పచ్చని పాదాలను ముద్దుపెట్టుకుంటోంది. తులసి అందగత్తె అని మొదటి సారిగా అనిపించింది.

"ఆ ఎర్రని దొండపండులాంటి తులసి పెదవులను ముద్దు పెట్టుకో, ముద్దుపెట్టుకో నలిపెయ్" అని బొంగురుగా అరిచారెవరో. కంగారుగా వెనక్కి చూశాను. ఎవరూలేరు. అరుపులు ఆగలేదు... నాలోంచే ఆ అరుపులు ! నా గుండె ఝల్లుమంది

నాలోని మృగం గొంతుక అది. మగవాడికి వేలాది సంవత్సరాలుగా వారసత్వంగా వస్తూన్న మృగపశు ప్రవృత్తి నాలోనూ ఎంతబలంగా నిగూఢంగా ఉంది! స్త్రీ వాంఛ ఎంత బలవత్తరమైనది! ఏకాంతంలో తులసిని చూశాక గానీ నాఒక్కదేహంలో ఇంత కాంక్షా, వాంఛాలోలత్వమూ ఉన్నాయని నాకే తెలియలేదు. నాలోని మృగం విజృంభణముందు నా చదువు, వివేకం, సంస్కారం ఏగంగలో కలిసాయి? నేనేనా స్త్రీవాంఛకు అతీతుణ్ణి అనుకున్నది!

స్త్రీవాంఛని జయించలేకే, ఉక్రోషంతో, నీచంగా-

స్త్రీని నరకద్వారంగా, మోక్షానికడ్డు పడేభూతంగా చిత్రీకరించారుకాబోలు మతాచార్యులూ, పెద్దలూ! సభ్యతా, సంస్కారాలు మనిషి వేసుకునే మేలి ముసుగులు, అవకాశం దొరకగానే ఆ ముసుగు ఎగిరిపోతుంది. చెడ్డపనులు చేసే అవకాశాలు, ధైర్యమూలేక లోకంలో చాలామంది పెద్దమనుషులుగా, గౌరవనీయులుగా చెలామణీ అయిపోతుంటారేమో! సందుదొరికితేనేగానీ నాలోని పెద్ద మనిషి ఎంత చిన్న వాడో నాకు తెలిసిరాలేదు. ఇలా ఎంతమంది తమకు తాము చాలా గొప్పవాళ్లమనీ, ఉన్నత సంస్కారులమనీ ఆత్మవంచన చేసుకుంటూ ఉంటారో! అవకాశాలు మాత్రమే మనిషినైజం పట్టివ్వ గలవేమో?!

తులసి నన్ను సంస్కారవంతుణ్ణని నమ్మి నిర్భయంగా, తల్లిఒడిలోని చంటిపిల్లలా హాయిగా నిద్రపోతోంది. ఈ క్షణాన తన గురించి నేనెంత నీచంగా ఆలోచిస్తూన్నానో తులసికి తెలిస్తే నన్ను క్షమిస్తుందా?

తులసిని అడ్డుపెట్టుకొని నన్ను వంచాలని చూస్తూన్న నాలోని మృగాన్ని నేను జయించలేనా? తులసినే సాధనంగా చేసుకుని ఈ వికారాన్ని, ఈ దౌర్బల్యాన్ని లొంగదీస్తాను-అనుకుంటూ తలసివంకే తధేకంగా చూడసాగాను. క్రమేసీ నాకళ్లు బరువెక్కి కూరుకుపోసాగాయి. తులసి మసక మసకగా అనుతోంది.

ఆకాశంలో చంద్రుడు ఇంకా క్రిందికి దిగడంతో గదంతా పిండారబోసి నట్టు వెన్నెల పరచుకుంది... తెలుపు...తెలుపు.... గదంతా తెలుపు...తెల్లని చంద్రుడు తెల్లని ఆకాశం... తులసి తెల్లచీర... నాకళ్లు బరువెక్కి మూసుకుపోతున్నాయి...తులసి...తులసి..., పకపకా నవ్వుతోంది...నవ్వుతూ చిన్నదైపోతోంది.

తులసి...తులసి ఒంటి మీద చీరలేదు. పరికిణీ ఓణీలో వద్దెనిమిదేళ్లు తులసి... ఇంకా చిన్నదై పోతోంది....చిన్నపొట్టిగౌనులో తులసి ఇంకా పకపకా నవ్వుతూ చిన్నదైపోతోంది. చివరికి చిన్నగా, బొద్దుగా, నగ్నంగా, తులసి... నాచేతుల్లో తులసి! పసితులసిని గుండలకదుముకుని ముఖమంతా ముద్దులతో తడిపేస్తున్నాను...చిన్న తులసి పకపకా నవ్వుతోంది.

'ఠఫ్' మని నా ముఖానికేదో బలంగా తాకడంతో మెలకువ వచ్చింది. పేపర్‌బోయ్ కిటికీలోంచి పేపర్ విసిరేసి పోతున్నాడు. బారెడు పొద్దెక్కింది. కంగారుగా లేచాను. గదిలో తులసిలేదు! పరమ చండాలంగా ఉండే నా బ్రహ్మచారిగది నీట్‌గా అందంగా సర్దిఉంది. టేబుల్ మీద కాగితం ఒకటి మడిచిపెట్టి ఉంది. రాత్రి నిద్రసరిపోక నాకళ్లు భగ్గుమంటున్నాయి. అయినా ఉత్తరం విప్పాను.

"మైడియర్ మొద్దు రాచ్చిప్పా! కాఫీ కలిపి ఫ్లాస్కులో పోశాను. ముందు వేడికాఫీ తాగి ఉత్తరం




చదువు. రాత్రంతా నిద్రలేనిది నీకేకాదు. నాకూలేదు. రాత్రంతా నువు నిద్ర పోలేదనీ, పోలేవనీ నాకు తెలుసు...నీలో సంఘర్షణ, నీతో నీనిశ్శబ్ద పోరాటం రాత్రంతా గమనిస్తూనే వున్నాను. నా విపరీత ప్రవర్తన కర్థం, నేను నీకు పెట్టిన పరీక్ష. చాలామందికి మంచిపనుల చెయ్యటం చేతకానట్లే బహుకొద్దిమందికి చెడ్డపనులు చెయ్యటం చేతకాదు. నువురెండో కేటగిరీ అని నాకెందుకో నమ్మకం. నాపరీక్షలో నువ్వు నీలోని మృగాన్ని బాగానే అదుపు చెయ్యగలిగావ్. ఎంతైనా నేను నీ లెక్కల పంతులమ్మని. నాశిష్యుడిపై నానమ్మకం చెక్కుచెదరలేదు.

"కృష్ణా నాగతం నీకు తెలుసు. ఒక్క వంశోద్ధారకుడి ముందు ఎంతమంది ఆడపిల్లలైనా సాటిరారనుకున్న తల్లిదండ్రుల మూర్ఖత్వానికీ, స్వార్థానికీ నేను బలి అవ్వాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతలు నెత్తిన వేసుకోకుండా నాదారిన నేనుపోవచ్చు. కానీ పేగు సంబంధం నన్ను అలాపోనీయలేదు. ఆడపిల్లలైనా కొడుకులకి తీసిపోరని నిరూపించాలని నిలబడ్డాను. చెల్లెళ్ల బరువు బాధ్యతలు పూర్తి చేసేసరికి నడివయసు నెత్తికొచ్చింది. లోకం'వృద్ధకన్య' అనే బిరుదు ఇచ్చింది. ఏ ఆడపిల్లైనా తనంత తాను వృద్ధకన్యగా ఉండిపోవాలని కోరుకుంటుందా కృష్ణా? నాకెలాగూ పెళ్లి వయసు దాటిపోయింది గాబట్టి, పెళ్లి ఆలోచన మానేసి, వాళ్ల పిల్లల్లో ఎవరో ఒకరినె నేను పెంచుకోవాలని నా చెల్లెళ్ల, అమ్మ ఉద్దేశం. తోడేళ్లు అడవుల్లోనే ఉంటాయని చిన్నపుడు అనుకునేదాన్ని. కానీ ఇళ్లల్లో కూడా ఉంటాయని ఆలస్యంగా తెలుసుకున్నానుకృష్ణా! అన్నం తినడానికి విస్తరి అవసరం. కానీ భోజనం అయాకా అదే విస్తరిని పెంటకుప్ప మీదకు విసిరేస్తారు. అందుకునేను వాళ్ళని నేను తప్పుపట్టడంలేదు. మానవునినైజం ప్రథమగుణం స్వార్థం కాబోలు. తల్లిదండ్రులైనా, తోడబుట్టిన వాళ్లయినా దానికతీతులు కారుగా కానీ కరడు గట్టిన స్వార్థంవల్ల ఎంత ప్రమాదమో - అసలు స్వార్థమే లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు వస్తాయని తెలుసుకున్నాను. కొంచెమైనా స్వార్థంలేకపోతే ప్రపంచం బ్రతకనీయదు. మనుషులు స్వార్థాన్ని చూస్తుంటే బాధవేయటంలేదు కృష్ణా. నవ్వువస్తోంది. నాబాధ నవ్వు రూపంలోనే వ్యక్తమవుతుంది.

"నేను కట్నం ఇవ్వడానికో, నెలనెలా జీతం తెచ్చి దోసిట్లో పోయడానికో అంగీకరించి ఉంటే నాపెళ్లయి ఉండేది. కాని నా డబ్బు కోసమే నన్నాశించేవాడు నాకక్కర్లేదు. స్త్రీ పురుష సంబంధాలని శాసించే విషయం డబ్బే అయితే అది వ్యభిచారం కన్న గొప్పదేమీకాదు. అటువంటి సంబంధాలకి నాకు మనస్కరించలేదు. నన్ను నన్నుగానే స్వీకరించే వ్యక్తి తారసపడనపుడు ప్రేమలేని పెళ్లి కన్నా అవివాహితగానే ఉండిపోవాలని నిశ్చయించుకున్న దశలోనే నువ్వు తారసపడ్డావు. నాతో స్నేహం ఎండీబీటలువారిన భూమిలో తొలకరిజల్లులా అనిపించింది. నా ఒంటరి స్వభావం, సిగరితనం తెలిసి ఉండీ నిన్ను చాలా హింసించి బాధపెట్టాను.

"కృష్ణా! ప్రపంచంలో భయంకరమైనది ఒంటరితనం. ఎవరికీ చెందని, ఎవరికీ అవసరంలేని నిర్భాగ్య జీవితాన్ని గడపటం కంటే బాధాకరమైన శిక్ష మనిషికి మరొకటి లేదేమో. దేనికోసం, ఎవరికోసం ఇంతకాలం మన జీవితాల్ని నిస్సారం, అర్థవిహీనం చేసుకున్నాం? త్యాగం చేస్తున్నామనే తృప్తి, ఆనందం కోసమా? తల్లిదండ్రులకోసం, తోడబుట్టిన వాళ్లకోసం, కుటుంబంకోసం మన జీవితాలని మనమే కొవ్వొత్తిలా హరించేసుకున్నామే! దానివల్ల పొందిన ప్రతిఫలం ఏమిటి? ఎవరికోసం చేస్తారు-కొంపకి మొదటి సంతానమైపుట్టాకా' అన్న ఈసడింపేగా! దుర్భరమైన ఏకాకి జీవితమేగా!

"బాధ్యతలు తీరాయి కాబట్టి ఈనాడు డబ్బు,



## ప్రోత్సాహక బహుమతి పొందిన 'ఆర్తి' కథా రచయిత

### —— శ్రీ డి.ఆర్. ఇంద్ర ——

పుట్టిన ఊరు - కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 1951లో. స్థిరపడిన ఊరు - రాజమండ్రి.

చదువు - హిస్టరీ, పొలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లలో మాస్టర్ డిగ్రీలు, కౌన్సిలింగ్ సైకాలజీలో గ్రాడ్యుయేట్ డిప్లొమా. వృత్తి - సైకో థెరపిస్ట్‌గా 'స్పందన' సైకలాజికల్ క్లినిక్ నిర్వహణ. ప్రవృత్తి - సౌందర్య సృష్టి, రాక్ గార్డెన్స్, శిల్పాలు చెక్కడం, మినియేచర్ మోడల్ మేకింగ్ వగైరాలు.

గృహమే కదా స్వర్గసీమ అనిపింపచేసే అర్ధాంగి వైశాలి నా విజయాలకి వెనుకదన్ను. లా చదువుతున్న ఏకైక సుపుత్రుడు రాహుల్.

సీరియస్‌గా కథలు రాయడం, పత్రికలకు పంపడం ఇటీవలే మొదలు. పాతిక వ్యంగ్య రచనలు, అరడజను కథలు అచ్చయ్యాయి. 'ఆంధ్రప్రభ'లో ఇదే నా తొలి కథ.

స్త్రీలకు సమాజంలో సముచితమైన భాగం ఇవ్వకుండా, అణచివేత, అసమానత్వాల నుండి స్త్రీని విముక్తం చేయకుండా ఏ అభ్యుదయ సమాజ నిర్మాణమూ సాధ్యం కాదని నా నమ్మిక. అందుకే స్త్రీ విముక్తి కోసం, నానాటికీ దిగజారుతున్న మానవ సంబంధాలు, నైతిక విలువల పునరుద్ధరణ కోసం నిలవటం రచయితగా నా ధ్యేయం.

చరిత్ర, సైన్స్, కళలు, సంగీతం నా అభిమాన విషయాలు. చలం, రంగనాయకమ్మ, రాహుల్ సాంకృత్యాయన్, వడ్డెర చండీదాస్ నా అభిమాన రచయితలు.

**డి.ఆర్. ఇంద్ర, 86-15-6, వాద్రేవునగర్, తిలక్‌రోడ్, రాజమండ్రి - 533 103.**

'హోదా, ఏవైనా సంపాదించవచ్చు. కానీ చేజారిపోయిన జీవితం తిరిగి వస్తుందా? ఎండిన మోడు చిగురిస్తుందా? అటువంటపుడు చేసిన త్యాగాలకి అర్థం ఏమిటి కృష్ణా?

"జీవితంలో ఎవరు ఎందుకు దూరమౌవుతారో తెలీనట్లే ఎవరు ఎందుకు దగ్గరవుతారో కూడా తెలియకపోవడం లోనే జీవితరహస్యం ఉందేమో. నువ్వు నాకెందుకు నచ్చావో, నాకెందుకు కావాలనిపించావో విశ్లేషించి చెప్పలేను. మనసు భాష విప్పి చెప్పలేనిది. చిన్న కుర్రవాడు తాయిలాన్ని అరచేతిలో పెట్టుకుని తినకుండా చూస్తూ నిగ్రహించుకున్నట్లు- నిన్నభిమానించే పరాయి ఆడపిల్లని ఓరాత్రంతా నీ గదిలో ఎదురుగా పడుకోబెట్టుకునీ బుద్ధుడిలా ఉండగలావ్. నావంక అలా రాత్రంతా చూసి చూసీ తెల్లవార కట్ల నిద్రలోకి జారుకున్న నిన్ను లేపి- ఆకలికి ఏడ్చిఏడ్చి నిద్రపోతున్న చంటిపిల్లవాడ్ని తల్లి ఆర్తిగా గుండెలకి హత్తుకున్నట్లు హత్తుకోవాలనిపించిన నా కోర్కెను బలవంతాన అణుచుకున్నాను. కుసంస్కారం, స్వార్థం రాజ్యమేలే లోకంలో నీలాటి చంటి పిల్లవాడికి నాలాటితల్లి చాలా అవసరం కృష్ణా! మగవాడి కోసం, సెక్స్‌కోసం నేను వెంపర్లాడి పోవటంలేదు. అందరాడపిల్లలకి పెళ్లయే వయసులోనే నాకూ పెళ్లయితే ఈపాటికి అమ్మమ్మనయి ఉండేదాన్ని.

"ఇంతవరకూ ఇతరులకోసం జీవించిన మనం మిగిలిన జీవితమైనా మన కోసం జీవిద్దామనే నా కోరిక అసంమజసమైనదా కృష్ణా? జీవితం చాలా అపురూపమైంది. కానీ ఇంతవరకు జీవించిన జీవితానికి ఏమిటి అర్థం? ఆలోచించు కృష్ణా. మన ఒంటరి బ్రతుకుల్ని వివాహబంధంతో ముడివెయ్యమనో, నాబరువు బాధ్యతల్ని నీ నెత్తికెత్తు కొమ్మనో డిమాండ్ చేయడంలేదు. పెళ్లి, సంసారం, పిల్లలు, ఇవేమీ నీనుండి ఆశించడంలేదు. నీకు నీవుగా, నాకు నేనుగా ఉంటూ సహజీవనం చెయ్యనీ. జీవనపథంలో ఒకరికొకరు తోడుగా ఉండనీ. నా ఈ కోరిక, వెర్రిగా అనిపిస్తే నన్ను ఉదారంగా క్షమించే సహృదయం నీకుందని నమ్ముతున్నాను. సాయంత్రం పార్కులో ఎదురు చూస్తూ ఉంటాను. నువు రాకపోతే...ఇంక నీకు ఫోన్ చేసి బాధపెట్టను."

ఉత్తరం మడిచి జేబులో పెట్టాను. కాఫీ త్రాగి మళ్లీ పడుకున్నాను. సాయంత్రం పార్కుకి వెళ్లలేదు. తులసి ఎన్నడూ మళ్లీ ఫోన్ చెయ్యలేదు.

రెండు నెలల తర్వాత ఇంటిదగ్గరనుండి పెద్ద ఉత్తరం వచ్చింది. నేను తులసిని రిజిస్టర్ మారేజి సుకున్నానని తెలిసి అమ్మానాన్న అక్షింతలు వేస్తూ రాసిన చాలా పొడుగు ఉత్తరం. తమ కుటుంబం పరువు ప్రతిష్ఠలనీ, సంప్రదాయాలనీ, పెద్దరికాన్నీ మంటకలిపి, పెళ్లికోసం వెంపర్లాడిపోతూ కులంకాని దాన్నీ, వయసులో పెద్దదాన్ని కట్టుకున్నందుకు నలుగురిలోనూ సిగ్గుతో చితికిపోతూన్నారట. నాలాటి దౌర్భాగ్యుడ్ని, సిగ్గుమాలిన వాడ్ని తమ పెద్ద కొడుకుగా చెప్పుకోవడం సిగ్గుచేటనీ, నేనింక 'ఆ ముదనష్టపు దానితో' కలిసి తమ గడప త్రొక్కనవసరం లేదనీ ఉత్తరం సారాంశం. నేను పుట్టి బుద్దెరిగిన తర్వాత అమ్మా, నాన్నా నాకు సంతోషం కలిగిస్తూ రాసిన మొట్టమొదటి, చిట్టచివరి ఉత్తరం అదే!

●

[వచ్చే వారం: ప్రోత్సాహక బహుమతి పొందిన కథ - 'తిరిగిరానిది' - శ్రీకాంత్]

